క్లుప్తంగా

ఘనంగా గంధ మహోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మిలాద్ – ఉన్ – నబీని పురస్కరించుకొని జనార్దన్‌రెడ్డి కాలనీలో గంధ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. పీర్లను ఊరేగించారు.

సీతారామ్ ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం



మాట్లాడుతున్న మోహన్‌రావు

కోవూరు: సీపీఎం నేత సీతారామ్ ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సీతారామ్ ఏచూరి వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులు, రైతులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జక్కా శేషమ్మ, గండవరపు శేషయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభినయంతో బోధన.. ఆనందదాయక అభ్యసన



ప్రత్యేక తరగతికి హాజరైన విద్యార్థులతో హెచ్‌ఎం, హిందీ పండిట్

కొడవలూరు: అభినయంతో బోధన.. ఆనందదాయక అభ్యసన పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని గండవరం ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించారు. హిందీ పాఠ్య పుస్తకంలోని బారిష్ అనే అంశాన్ని అభినయం ద్వారా హిందీ పండిట్ నాగభూషణం వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మీకాంతం మాట్లాడారు. బోధనను ఈ – కంటెంట్‌గా రూపొందించి ఆన్‌లైన్లో పొందుపర్చనున్నామని, ఇది ఎంతో మందికి ఉపయోగపడుతుందని చెప్పారు.

రైల్లోంచి పడి యువకుడి మృతి



కొడవలూరు: రైల్లోంచి జారిపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తలమంచి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై వెంకట్రావు వివరాల మేరకు.. తలమంచి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైల్లోంచి జారపడి జార్ఖండ్‌కు చెందిన నోవల్ టప్నో (45) అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కసుమూరులో భక్తుల ప్రార్థనలు

వెంకటాచలం: కసుమూరు దర్గాలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున రావడంతో దర్గా ప్రాంగణం సందడిగా మారింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పొదలకూరు: మండలంలోని సోమశిల మార్గం కనుపర్తి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గురవాయపాళెం ఎస్సీ కాలనీకి చెందిన బిరదవోలు ప్రసాద్ గ్రామం నుంచి మోటార్‌బైక్‌పై సమీపంలోని వనంతోపు సెంటర్‌కు వెళ్తున్నాడు. చేజర్ల మండలం గాలిపాళెం నుంచి కట్టెల లోడుతో పొదలకూరు వైపు వస్తున్న ట్రాక్టర్, ప్రసాద్ బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ప్రసాద్ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

పూడికతీతకు నోచుకోని కాలువలు

విడవలూరు: పంట కాలువల్లో పూడికతీతను సక్రమంగా చేపట్టకపోవడంతో పంట చేతికొచ్చే సమయానికి ఎండిపోతోందని వావిళ్ల, గాదెలదిన్నెకు చెందిన రైతులు వాపోయారు. ఈ మేరకు శ్రీనివాసులు, శివ మాట్లాడారు. ఉపాధి పనుల్లో భాగంగా వావిళ్లలో పంట కాలువలను ఎంచుకోకపోవడం.. పనులను సక్రమంగా చేపట్టకపోవడంతో కొద్దికాలంలోనే గడ్డి పెరిగిపోయి, నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సెల్లార్లూ.. అద్దెకే

- మామూళ్లు పుచ్చుకొని పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- ఫుట్‌పాత్‌లపై నడిచేందుకూ ఇబ్బందే

నెల్లూరు(బారకాసు): నగరంలోని వాణిజ్య సముదాయాల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. భవనాల్లోని సెల్లార్లను పార్కింగ్ కోసం వినియోగించాల్సి ఉండగా, దుకాణాలుగా మార్చి అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సెల్లార్లను పార్కింగ్‌కే వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలు కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అయినా టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో నేటికీ ఎలాంటి చలనం లేదు. మామూళ్లను పుచ్చుకొని చర్యలు చేపట్టేందుకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎక్కడ చూసినా అంతే..

నగరంలో దాదాపు వందకుపైగా పెద్ద భవంతులున్నాయి. దీని కోసం ముందుగా టౌన్‌ప్లానింగ్ ద్వారా అధికారికంగా అనుమతులను పొందాలి. అయితే సెల్లార్లను పార్కింగ్ కోసం వదిలినట్లు ప్లాన్‌లో చూపుతూ.. ఆ తర్వాత దాన్ని విస్మరిస్తున్నారు.

గోదాములగానూ వినియోగం

మరోవైపు కొన్ని ప్రాంతాల్లో సెల్లార్లను గోదాములుగా వినియోగిస్తున్నారు. ఒకవేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏమిటాననే ఆందోళన నెలకొంటోంది. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లోని సెల్లార్లలో ఐసీయూలు, స్కానింగ్ కేంద్రాలు, ఎక్స్‌రే, ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితితో వాహనాలు నిలిపేందుకు వీల్లేక రోడ్డుపైనే ఆపాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు చేపడతాం

నగరంలోని సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కే వినియోగించాలి. దుకాణాలు, గోడౌన్లు తదితరాలకు వాడటం తగదు. ఇలా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తాం. పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటాం.

– హిమబిందు, సిటీ ప్లానర్, నగరపాలక సంస్థ

క్రీడాకారుడికి సత్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయిలో చిలకలూరిపేటలో నిర్వహించిన క్యారమ్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించిన నిమ్మల వెంకయ్యను ఆదివారం సత్కరించారు. నగరంలోని నెల్లూరు క్లబ్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి, క్యారమ్ అసోసియేషన్ జిల్లా జిల్లా అధ్యక్షుడు రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి సన్నిధికి భక్తుల పాదయాత్ర



నెల్లూరు(బృందావనం): గొలగమూడిలోని వెంకయ్యస్వామి సన్నిధికి పాదయాత్రను భక్తులు ఆదివారం చేపట్టారు. బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి ప్రారంభమైన పాదయాత్రకు 350 మందికిపైగా సాయిభక్తులు హాజరయ్యారు. అనంతరం సాయిదర్బార్ అద్దాల మందిర తరఫున వెంకయ్యస్వామికి పట్టు వస్త్రాలు, పూలమాలలు తదితరాలను సమర్పించారు. మందిర చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రహణంతో ఆలయాల మూత





నెల్లూరు(బృందావనం): సంపూర్ణ చంద్ర గ్రహణ నేపథ్యంలో నగరంలోని ఆలయాలను ఆదివారం సాయంత్రం 4.30కు మూసేశారు. తలుపులను సోమవారం ఉదయం 6.30కు తెరిచి శుద్ధి, దేవతామూర్తులకు స్నపనం అనంతరం ఎనిమిది గంటల తర్వాత భక్తులకు దర్శనాన్ని కల్పించనున్నామని ఈఓలు తెలిపారు. మూలస్థానేశ్వరాలయం, రంగనాథస్వామి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం తదితరాలను మూసేశారు.

ప్రీమియంపై జీఎస్టీ తొలగింపుతో మేలు



మాట్లాడుతున్న రాజశేఖర్

నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తొలగించడంతో పాలసీదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ ఏపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ పేర్కొన్నారు. హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏజెంట్లతో ఆత్మీయ సభను యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. జీఎస్టీ తొలగింపుతో భారం తగ్గడమే కాకుండా భవిష్యత్తులో బీమా చేసుకునే వారి సంఖ్యా పెరుగుతుందని చెప్పారు. డివిజన్ కోశాధికారి ధనుంజయ, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేద పండితులతో నిర్వహించిన హోమానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి, చండీమాతను దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా గంటి జగన్నాథం దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

దివ్యాంగ ఉపాధ్యాయులకు అభినందన



నెల్లూరు(బృందావనం): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో 50 మంది దివ్యాంగ ఉపాధ్యాయులకు సన్మాన సభను సక్షమ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, వీఎస్‌యూ ఆంగ్ల శాఖాధిపతి భగవాన్, ఆరెస్సెస్ సేవా ప్రముఖ్ మల్లికార్జునరెడ్డి, సక్షమ్ జిల్లా కార్యదర్శి రంగయ్య, జ్యోతిర్మయి, చెంచురెడ్డి, వేణుగోపాల్, మల్లికార్జున్, హరిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నిత్యహోమాలు, పూర్ణాహుతి, తిరుమంజనం, గోపురోత్సవం, మహాకుంభప్రోక్షణ తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పోలూరు సుబ్బయ్య, పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ కమిటీకి అభినందన

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సరీ్వసెస్ జిల్లా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగడంపై ఏపీజేఏ జిల్లా కార్యదర్శి రామ్‌ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలను తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విజయవాడలో ఈ నెల 13న సమావేశాన్ని కార్మిక, కర్షక కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడు ఉదిత్ రాజ్ నిర్వహించనున్నారని, ఇందులో ఆర్టీసీ విశ్రాంత కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని కేకేసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు వీరపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ సక్రమంగా అందడంలేదని చెప్పారు. రైతులు, అసంఘటిత కార్మికులు ఇలా అందరూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారని తెలిపారు. వీటన్నింటినీ ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, గోపీకృష్ణ, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం



నెల్లూరు(బృందావనం): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయుడు అబ్దుల్ మాజిద్‌ను పొట్టి శ్రీరాములు వాకర్స్ కార్యాలయంలో మురళీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ ఆనంద్ ద్వారా ఆయన అందుకున్నారని చెప్పారు. శింగంశెట్టి మురళీమోహన్‌రావు, కేతా సుబ్బారావు, జయప్రకాష్, ప్రసాద్‌బాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పేర్నేటి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర పరిశీలకుడిగా నియమితులైన పేర్నేటి కోటేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ నగర కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు.

తాగునీరు.. నేలపాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలో తాగునీటి కుళాయి పైప్ పగిలిపోవడంతో నీరు వృథాగా కాలువలో ప్రవహిస్తోంది. తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తామంటూ తరచూ ఊదరగొట్టే అధికారులు, దీన్ని పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఇప్పటికైనా పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలివ్వాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గత ప్రభుత్వ తరహాలోనే ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలను ప్రస్తుత ప్రభుత్వం అందజేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేతలు ఖలీల్ అహ్మద్, హంజా హుస్సేనీ, సిద్ధిఖ్, సమీర్‌ఖాన్, మహబూబ్‌బాషా, మస్తాన్, యస్దానీ, అలీమ్‌తో కలిసి పోస్టర్లను పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని పార్టీ నగర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముస్లింలను సీఎం చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. వీరికి వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చి, ఇచ్చే మొత్తాన్నీ ఆపేశారని ధ్వజమెత్తారు. ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేయనున్నామని పేర్కొన్నారు.

జేవీవీ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న గేయానంద్

నెల్లూరు (టౌన్): జన విజ్ఞాన వేదికకు తెలుగు ప్రజలతో విడదీయరాని బంధం ఉందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. అన్నమయ్య సర్కిల్‌లోని యూటీఎఫ్ భవనంలో జేవీవీ జిల్లా మహాసభలను ఆదివారం నిర్వహించారు. పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జేవీవీ ఆర్థిక నివేదికను అందజేశారు. జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కాలేషాబాషా, కామయ్య, పెంచలయ్య, అధ్యక్షుడిగా చలపతి, కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా బుజ్జయ్యతో పాటు 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చొప్పా రవీంద్రబాబు, మాజీ రాష్ట్ర కార్యదర్శి శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, విద్యాచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధంకండి



మాట్లాడుతున్న ప్రసాద్



హాజరైన సీఐటీయూ నేతలు, కార్యకర్తలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమాలు చేసే సమయం ఆసన్నమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు. వేదాయపాళెంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ నెల్లూరు రూరల్ మహాసభలో ఆయన మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను కేంద్రం తీసుకొస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నా, ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ప్రశ్నించకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. కరేడులో పేద రైతుల భూములకు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సుధాకర్, పెంచలనరసయ్య, కోశాధికారిగా ఖాజావలీ ఎన్నికయ్యారు. మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, నరసింహారెడ్డి, శివాజీ, దేశమూర్తి, సుజాతమ్మ, అంజిరెడ్డి, సందానీబాషా, సంపత్‌కుమార్, మాలకొండయ్య తదితరులు, పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

సీఐటీయూ నెల్లూరు రూరల్ మహాసభ ముగింపును పురస్కరించుకొని వేదాయపాళెం నుంచి అయ్యప్పగుడి సెంటర్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘అన్నదాత పోరు’ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎరువుల్లేక రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే, బ్లాక్ మార్కెట్‌కు కొందరు తరలిస్తున్నారని ఆరోపించారు.

తక్కువ ఖర్చుకే వైద్యసేవలందించాలి



నెల్లూరు(అర్బన్): పేదలకు తక్కువ ఖర్చుకే వైద్య సేవలను అందించి మంచి పేరు తెచ్చుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కాంక్షించారు. రామలింగాపురం సమీపంలోని ఇరిగేషన్ కార్యాలయ పక్క వీధిలో అమ్మ హాస్పిటల్, ఐవీఎఫ్ సెంటర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం గైనకాలజిస్ట్ దివ్యశ్రీ మాట్లాడారు. మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చికిత్సను ఇక్కడే అందిస్తామని చెప్పారు. ఆస్పత్రి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని స్త్రీలకు ఓపీ, స్కానింగ్, సెమన్ అనాలసిస్ తదితర సేవలను ఈ నెలాఖరు వరకు ఉచితంగా నిర్వహిచనున్నామని తెలిపారు. పీడియాట్రిక్ డాక్టర్ కేదార్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు



ఖాతాదారులకు సత్కారం

నెల్లూరు(అర్బన్): రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తదితరులకు రుణాలను విరివిగా అందిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోనల్ మేనేజర్ బంగార్రాజు పేర్కొన్నారు. బ్యాంక్ వార్షికోత్సవ వేడుకలను ముత్తుకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం పలువురు సీనియర్ కస్టమర్లను సత్కరించారు. జోన్ డిప్యూటీ మేనేజర్ మహంతి, నెల్లూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సందీప్‌రాజు, నాగేశ్వర్, సాగర్ పాల్గొన్నారు.

నేత్రదానం





విజయలక్ష్మి, వెంకటసుబ్బారావు (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని పిన్నంరాజువారి వీధికి చెందిన యేనుగుల విజయలక్ష్మి (60) తన నివాసంలో ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి స్థానికులు రాంబాబు, వెంకటేష్, సంతోష్ సహకారంతో కుటుంబసభ్యుడు రాధాకృష్ణ దానం చేశారు.

⇨ నగరంలోని ఐదు లాంతర్ల సెంటర్‌కు చెందిన కర్నాటి వెంకటసుబ్బారావు (67) తన నివాసంలో మృతి చెందారు. ఆయన నేత్రాలను ప్రభుత్వాస్పత్రికి రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ శ్రీవాణి, వాసవీ వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత ప్రోత్సాహంతో కుటుంబసభ్యురాలు నీరజాక్షి దానం చేశారు. వీరి నేత్రాలను టెక్నీషియన్ సునీల్ సేకరించి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 99124 70094 నంబర్లను సంప్రదించాలని కోరారు.